సాక్షి
నిజామాబాద్
బుధవారం । 13 । మార్చి । 2024



లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ప్రతి మహిళ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు కృషి చేయాలని అదనపు జడ్జి కుప్పా ఉపాధ్యాయ సూచించారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
37.8 /25.0

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రమాద బీమాకు పేర్లు నమోదు చేసుకోవాలి

- జిల్లా మత్స్య శాఖ అధికారి రాజనర్సయ్య

డొంకేశ్వర్(ఆర్మూర్): మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న మత్స్యకారులు ప్రమాద బీమా కోసం ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా మత్స్య శాఖ అధికారి రాజనర్సయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మత్స్యకారులు మరణిస్తే వారి కుటుంబాలకు 'మత్స్య సంపద యోజన' ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 5 లక్షల వరకు బీమా డబ్బులు అందజేస్తాయన్నారు. అర్హులైన మత్స్యకారులు తమ పేర్లను జిల్లా మత్స్య శాఖ కార్యాలయానికి వచ్చి నమోదు చేసుకోవాలన్నారు. మత్స్యకారుడితో పాటు నామిని ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను అందజేయాలని సూచించారు.

ఆర్మూర్ బల్దియా ఇన్‌చార్జి చైర్మన్‌గా షేక్ మున్ను

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా వైస్ చైర్మన్ షేక్ మున్నుకు అదనపు బాధ్యతలిస్తూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన మున్సిపల్ కమిషనర్ రాజు సమక్షంలో ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం ఖాళీ అయినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గెజిట్‌లో నోటిఫై చేసింది. ఎన్నికల కమిషన్ చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీచేసే వరకు వైస్‌చైర్మన్ షేక్ మున్ను ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలను నిర్వహిస్తారు. మున్నును కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు బండారి ప్రసాద్, లిక్కి శంకర్, రాము, నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, రహమాన్ అభినందించారు.

డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి శశికళ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. డీఎడ్, బీఎడ్, టెట్ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 12 నుంచి 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 77021 75493, 99511 99460 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో..

బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ ఉచిత కోచింగ్ కోసం ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు ఈనెల 14 నుంచి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ వెంకన్న ఓ ప్రకటనలో కోరారు. కోచింగ్ 75 రోజులపాటు ఉంటుందని, ఇంటర్, డీఎడ్, టెట్ మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. మిగతా వివరాలకు 86390 02255 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బ్యాంకింగ్ ఫైనాన్స్‌లో శిక్షణ కోసం..

నిజామాబాద్‌అర్బన్: బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఉపాధి కల్పన కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా రెండు నెలల పాటు శిక్షణ కొనసాగుతుందని, అనంతరం ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ చేసి 26 ఏళ్లలోపు వయస్సున్న అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 25వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 31న ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందన్నారు.

పసిడి పరుగులు

- 10 గ్రాములకు రూ.66,400

సాక్షి, కామారెడ్డి: పసిడి ధర పరుగులు తీస్తోంది. మంగళవారం మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర రూ.66,400లకు చేరింది. ఇది ఆల్‌టైం రికార్డు. ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవలి వరకు రూ.62 వేల నుంచి రూ. 64 వేల వరకు ఉన్న ధర వారం రోజులుగా పెరుగుతూ వస్తోంది. మంగళవారం రూ. 66,400 లకు చేరింది.

తెయూ సైన్స్ బిల్డింగ్ తనిఖీ

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఆవరణలో కొనసాగుతున్న సైన్స్ బిల్డింగ్ నిర్మాణ పనులను రిజిస్ట్రార్ ఎం యాదగిరి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఏజెన్సీ తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్, వి మెన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దేవదాస్‌తో పలు అంశాలపై రిజిస్ట్రార్ మాట్లాడారు. వర్సిటీ అసిస్టెంట్ ఇంజినీర్ వినోద్ ఉన్నారు.

మాజీ జిల్లా సహకార అధికారి సింహాచలం అవినీతి అక్రమాలపై విచారణకు రంగం సిద్ధమైంది. విచారణాధికారిగా ఈ నెల 15న రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీ కమిషరేట్ నుంచి అడిషనల్ రిజిస్ట్రార్ రానున్నారు. సింహాచలం నిబంధనలు అతిక్రమించి డీసీసీబీ నుంచి సొసైటీలకు కోట్ల రూపాయల క్యాష్ క్రెడిట్ ఇప్పించాడనే ఆరోపణలు ఉన్నాయి. మాక్లూర్, తాళ్లరాంపూర్, ఎత్తొండ సొసైటీల్లో నిధుల దుర్వినియోగం వెనక ఆయన ప్రోత్సాహం ఉందంటున్నారు.



ఏ సొసైటీ చూసినా అవకతవకలే!

సాక్షి ఎఫెక్ట్..

- అక్రమాలను యథేచ్ఛగా ప్రోత్సహించిన మాజీ డీసీవో సింహాచలం
- 'సాక్షి' వరుస కథనాలకు స్పందన
- ఈ నెల 15న విచారణకు రానున్న కమిషనరేట్ ప్రత్యేకాధికారి
- కలెక్టరేట్‌లో ఆందోళన చేసిన తాళ్లరాంపూర్ సొసైటీ డిపాజిటర్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మాజీ జిల్లా సహకార శాఖ అధికారి సింహాచలం యథేచ్ఛగా అక్రమాలను ప్రోత్సహించడంతో జిల్లా వ్యాప్తంగా ప్రతి సొసైటీలో విచ్చలవిడి అవినీతి చోటుచేసుకుంది. ఏ సొసైటీలో చూసినా భారీగా అవకతవకలు బయటపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే సింహాచలం అవినీతి వ్యవహారాలపై కమిషనరేట్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలో 'సాక్షి'లో వరుసగా సింహాచలం అవినీతి పై కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీ కమిషరేట్ నుంచి అడిషనల్ రిజిస్ట్రార్ ప్రసన్న ఈ నెల 15న విచారణ నిర్వహించేందుకు నిజామాబాద్ రానున్నారు. ఈ విచారణకు సింహాచలంతో పాటు ఫిర్యాదు చేసిన వారిని సైతం హాజరు కావాలని సమాచారం ఇచ్చారు. దీంతో ఫిర్యాదు దారులు మరిన్ని వివరాలను, ఆధారాలను అందించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

■ మాక్లూర్ సహకార సంఘంలో మాజీ చైర్ పర్సన్ గోపు లక్ష్మి కుమారుడు గోపు రంజిత్ విచ్చలవిడి అవినీతికి పాల్పడ్డాడు. సింహాచలం మద్దతు తోడవడంతో రంజిత్ మరింత తెగించి సొసైటీని భ్రష్టు పట్టించాడు. రంజిత్ లక్ష్మి పేరిట అనామతుగా రూ.80.50 లక్షలు డ్రా చేశాడు. వీటిలో కేవలం రూ.37 లక్షలు మాత్రమే తిరిగి చెల్లించాడు. ఇంకా రూ.43.50 లక్షలు ఇప్పటి వరకు చెల్లించలేదు. దీనిపై సొసైటీ డైరెక్టర్లు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదు. ఇదిలా ఉండగా రంజిత్ ఎరువులను బ్లాక్‌లో అమ్మినట్లు రుజువైనప్పటికీ చర్యలు తీసుకోలేదు. మరో సందర్భంలో చైర్‌పర్సన్ లక్ష్మి, కొందరు డైరెక్టర్లు కలిసి ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా రూ.22 లక్షల రుణాలు తీసుకున్నారు. వాటిని కూడా ఇప్పటివరకు చెల్లించలేదు.

■ మాక్లూర్ సొసైటీలో గతంలో ప్రతి సీజన్‌కు సుతిల్ ఖర్చు రూ.6 లక్షలు రాగా, గోపు లక్ష్మి కుమారుడు రంజిత్ ప్రతి సీజన్‌కు రూ.18 లక్షలు చేశాడు. అదేవిధంగా హమాలీ ఖర్చు గతంలో రూ.5 లక్షలు రాగా రంజిత్ దాన్ని రూ.12 లక్షలు రాయడం గమనార్హం.

■ ఇక మాజీ డీసీవో సింహాచలం మాక్లూర్ సొసైటీలో పీఏ పేరిట రూ.5 లక్షల గోల్డ్ లోన్ తీసుకున్నారు. అదేవిధంగా రూ.14 లక్షల లారీ కిరాయిలను సైతం సింహాచలం వాడుకున్నాడు. ఈ వ్యవహారం సీఈవో విష్ణువర్ధన్ మీదకు రావడంతో అతను ఒత్తిడి చేశాడు. దీంతో సింహాచలం తిరిగి చెల్లించాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న సింహాచలం విష్ణువర్ధన్‌ను సస్పెండ్ చేయడం గమనార్హం.

■ ఎత్తొండ సొసైటీకి సంబంధించి నిబంధనలు అతిక్రమించి డీసీసీబీ నుంచి రూ.2.5 కోట్లు క్యాష్ క్రెడిట్‌ను సింహాచలం ఇప్పించాడు. డీసీవో కావడంతో సింహాచలం డీసీసీబీ డైరక్టర్‌గానూ ఉండడంతో ఇలా చేశాడు. ప్రతి 6 నెలలకు అనగా మార్చి 31, సెప్టెంబర్ 30న ఆడిటర్లు స్టాక్ తనిఖీ చేసి నివేదిక ఇస్తారు. ఎత్తొండ సొసైటీలో రూ.1.31 కోట్లు స్టాక్ ఉన్నట్లు నివేదిక ఇచ్చారు. నిబంధనల ప్రకారం రూ.4 కోట్ల మేర స్టాక్ ఉంటేనే క్యాష్ క్రెడిట్ ఇవ్వాల్సి ఉంటుంది. దీనిపై ఫిర్యాదు వెళ్లడంతో రూ.4 కోట్లు స్టాక్ ఉన్నట్లు సొసైటీ బాధ్యులు తప్పుడు నివేదిక ఇవ్వడం గమనార్హం. అయినప్పటికీ రూ.2.5 కోట్లు క్యాష్ క్రెడిట్‌ను సింహాచలం ఇప్పించడం గమనార్హం.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న తాళ్లరాంపూర్ సొసైటీ డిపాజిటర్లు

■ తాళ్లరాంపూర్ సొసైటీలో సభ్యులు చేసిన డిపాజిట్ల డబ్బులను తిరిగి చెల్లించే విషయంలోనూ సింహాచలం అడ్డుపడడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. మంగళవారం సదరు డిపాజిటర్లు తమకు రావాల్సిన రూ.1.50 కోట్ల కోసం కలెక్టరేట్‌లో ఆందోళన నిర్వహించారు. మాజీ సొసైటీ చైర్మన్ సామ గంగారెడ్డి డిపాజిట్ డబ్బులతో తాళ్లరాంపూర్‌లో 1, గుమ్మిర్యాలలో 2, తడపాకల్‌లో 1, దోంచందలో 1 గోదాములను కట్టారు. అలాగే తాళ్లరాంపూర్‌లో 1 ఫంక్షన్ హాల్, మరో రైస్‌మిల్ కట్టారు. ఈ రైస్ మిల్లును రూ. 2.20 కోట్లకు అమ్మారు. దీంతో పాటు గుమ్మిర్యాల సొసైటీ పాత భవనాన్ని రూ. 62 లక్షలకు అమ్మేశారు. తాళ్లరాంపూర్ సొసైటీ భూమిని రూ. కోటికి అమ్మారు. ఇలా అమ్మగా వచ్చిన డబ్బులను తమకు ఇవ్వాలని డిపాజిట్లు చేసిన సభ్యులు అడుగగా అప్పటి మంత్రి ప్రశాంత్‌రెడ్డి అడ్డుపడ్డారని ఆరోపిస్తున్నారు. ఇంకా 50 మందికి రూ. 1.5 కోట్లు రావాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసినవారు వాపోయారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమవ్వాలి

- ఏ క్షణమైనా షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం నుంచి ఏ క్షణమైనా షెడ్యూల్ వెలువడే అవకాశమున్నందున అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని, ఎన్నికల ఏర్పాట్లను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. మంగళవారం కలెక్టర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణ అంశాలపై సమీక్షించారు. గత ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరిగిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ప్రత్యేక చర్యలు చేపట్టాలని వికాస్‌రాజ్ సూచించారు. సెక్టోరల్ అధికారులతో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను సేకరించి పంపించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఇప్పటికే నియమించినట్లయితే శనివారం మొదటి ర్యాండమైజేషన్ జరపాలని, ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ కూడా ఒకే రోజు, ఒకే సమయంలో అన్ని జిల్లాల్లో చేపట్టాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం అందుబాటులో ఉండేలా చూడాలని, తమకు పోస్టల్ బ్యాలెట్ వసతి కల్పించలేదని ఏ ఒక్కరూ ఫిర్యాదు చేసేందుకు ఆస్కారం కల్పించవద్దన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, నోడల్ అధికారి సురేష్ కుమార్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, శ్రీరాం దత్తు, భుజంగరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్

ఒకేరోజు 26 మంది డిబార్

- ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో బోర్డు ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షల్లో మంగళవారం ఒకేరోజు 26 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఇంటర్ బోర్డు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం పరీక్ష ప్రారంభమైన అరగంటలోపే ధర్పల్లి పరీక్ష కేంద్రంలోకి ఇద్దరు సభ్యుల స్క్వాడ్ బృందం వచ్చింది. పరీక్ష కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేసి చీటీలతో దొరికిన తొమ్మిది మందిని డిబార్ చేశారు. అనంతర మోర్తాడ్ పరీక్ష కేంద్రానికి వెళ్లి తనిఖీ చేసి ఏకంగా 16 మందిని డిబార్ చేశారు. కాగా నగరంలో హరిచరణ్ మార్వాడీ పాఠశాలలో ఒక్కరిని స్థానిక స్క్వాడ్ బృందం పట్టుకుని డిబార్ చేసింది. దీంతో ఒకేరోజు 26 మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. జిల్లాలో ఇప్పటి వరకు 34 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు.

16,136 మంది హాజరు

ఇంటర్ సెకండియర్ పరీక్షలో భాగంగా మంగళవారం అర్థశాస్త్రం, భౌతిక శాస్త్రం పరీక్షలు జరిగాయి. జిల్లాలో మొత్తం 16,633 మంది విద్యార్థులకుగాను 16,136 మంది హాజరయ్యారు. 497 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 57 కేంద్రాలకుగాను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, స్క్వాడ్‌ల ఆధ్వర్యంలో 46 కేంద్రాలను తనిఖీ చేశారు. డీఐఈవో రఘురాజ్ నాలుగు సెంటర్లను తనిఖీ చేశారు.

సెల్ఫ్ సెంటర్లలో జోరుగా మాస్‌కాపీయింగ్

ఇంటర్ పరీక్షల్లో సెల్ఫ్ సెంటర్లు ఉన్నచోట జోరుగా మాస్‌కాపీయింగ్ కొనసాగుతోంది. కొన్ని రోజులుగా చీటీలు, పుస్తకాలతో పరీక్షలు రాస్తున్నట్లు ఆరోపణలు రావడంతో కొందరు ఇంటర్‌బోర్డుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇంటర్ బోర్డు అధికారులు రెండు రోజులుగా నిఘా పెట్టారు. మంగళవారం ఇద్దరు సభ్యుల బృందం జిల్లాకు వచ్చి నిఘా వేసింది. ధర్పల్లి, మోర్తాడ్ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులను తనిఖీలు చేయడంతో చీటీలతో దొరికిపోయారు.

తెయూ డిగ్రీ ఫలితాల్లో బాలికలదే పైచేయి



తెయూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి, కంట్రోలర్ అరుణ

- మొదటి, మూడో, ఐదో రెగ్యులర్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ(యూజీ) మొదటి, మూడో, ఐదో రెగ్యులర్ సెమిస్టర్ ఫలితాలను మంగళవారం కంట్రోలర్ ఎం.అరుణ, ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్‌లతో కలిసి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. డిగ్రీ ఫలితాల్లో అన్ని సెమిస్టర్‌లలో బాలికలదే పైచేయి కావడం హర్షనీయమన్నారు. డిగ్రీ సెమిస్టర్ ఫలితాలను పారదర్శకంగా వేగవంతంగా అందించడంలో కృషి చేసిన కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ, అడిషనల్ కంట్రోలర్స్ నందిని, శాంతాబాయి, పరీక్షల విభాగం సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో పీఆర్‌వో పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మొదటి సెమిస్టర్‌లో 23.51 శాతం

మొదటి సెమిస్టర్‌లో 3,619 మంది బాలురు, 5,015 మంది బాలికలు, మొత్తం 8,634 మంది పరీక్షలు రాశారు. ఇందులో 8.87 శాతంతో 321 మంది బాలురు, 34.08 శాతంతో 1,709 మంది బాలికలు, మొత్తం 23.51 శాతంతో 2,030 మంది ఉత్తీర్ణులయ్యారు.

మూడో సెమిస్టర్‌లో 32.07శాతం

మూడో సెమిస్టర్‌లో 3,220 మంది బాలురు, 4,927 మంది బాలికలు, మొత్తం 8,147 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 16.30శాతంతో 525 మంది బాలురు, 42.38 శాతంతో 2,088 మంది బాలికలు, మొత్తంగా 32.07 శాతంతో 2,613 మంది పాసయ్యారు.

ఐదో సెమిస్టర్‌లో 38.83 శాతం

ఐదో సెమిస్టర్‌లో 3,882 మంది బాలురు, 5,457 మంది బాలికలు, మొత్తం 9,339 మంది పరీక్షలు రాశారు. ఇందులో 21.84 శాతంతో 847 మంది బాలురు, 50.91 శాతంతో 2,778 మంది బాలికలు, మొత్తంగా 38.83 శాతంతో 3,626 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఫలించనున్న గల్ఫ్ ప్రవాసుల కల!

- ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కసరత్తు చేస్తున్న సీఎం
- గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించే అవకాశం
- పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఉత్తర్వులు జారీ చేయాలని పట్టుబట్టిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డిని గల్ఫ్ హామీల అంశంపై కలిసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, గల్ఫ్ సంఘాల ప్రతినిధులు

మోర్తాడ్(బాల్కొండ): పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రాకముందే గల్ఫ్ వలస కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు సంబంధించి ఉత్తర్వులను జారీ చేసే యోచనలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఎన్నికల ప్రచారంలో గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాల ఓట్లు అడగడానికి అవకాశం ఉంటుందని, ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేయించడానికి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పట్టుబట్టినట్లు చెప్పుకుంటున్నారు. ప్రవాసీ విధానంతో కూడిన గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. బోర్డు ఏర్పాటు విషయం ఎలా ఉన్నా మొదట గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ నాయకులు, గల్ఫ్ వలస కార్మికుల సంఘాల ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాల్లోని విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో ప్రత్యేక కోటా, ఆరోగ్యశ్రీ వర్తింపజేయడం, రేషన్ కార్డుల్లో వలస వెళ్లిన కార్మికుల పేర్లు తొలగించి ఉంటే తిరిగి చేర్చడం, మళ్లీ తొలగించకుండా చూడటం, వలస వెళ్లి ఇంటికి వచ్చిన వారికి స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలను ఇప్పించడం తదితర అంశాలపై ఉత్తర్వులను జారీచేసే అవకాశం ఉంది.

గల్ఫ్ ఓటు బ్యాంకు లక్ష్యంగా..

తెలంగాణ వాసులు దాదాపు 15 లక్షల మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. వలస వెళ్లి ఇంటికి తిరిగొచ్చిన వారి సంఖ్య మరో 30 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఇలా ప్రతి కార్మికుని కుటుంబంలో ఉండే ఓటర్లను పరిగణనలోకి తీసుకుంటే గణనీయ సంఖ్యలో గల్ఫ్ ఆధారిత ఓటర్లు ఉన్నారని కార్మిక సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాలు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపడంతో కొన్ని నియోజకవర్గాల్లో గట్టి పోటీని ఇవ్వడం, మరికొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇదే విధంగా లబ్ధి పొందాలనే ఉద్దేశంతోనే హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇదే జరిగితే మంచి పరిణామమే అని గల్ఫ్ వలస కార్మికులు ఆశిస్తున్నారు.

ఉత్తర్వులు జారీ చేసేలా చూస్తాం

గల్ఫ్ కార్మికుల ఆశలను నెరవేర్చడానికి ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసేలా సీఎంతో మాట్లాడాను. ఆయన సానుకూలంగా స్పందించారు. వలస కార్మికుల కుటుంబాలకు ఏ విధమైన ప్రయోజనాలను అందించాలనే అంశంపై అధికారుల బృందం చర్చిస్తోంది. తొందరలోనే ఉత్తర్వులను జారీ చేసే అవకాశం ఉంది.
– జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ

డిచ్‌పల్లి గూడ్స్ షెడ్డు జాతికి అంకితం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ వద్ద నిర్మించిన గూడ్స్ షెడ్డును వర్చువల్ విధానంలో మంగళవారం ఉదయం ప్రధాని నరేంద్ర మోదీ జెండా ఊపి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రూ.85 వేల కోట్ల విలువ గల రైల్వే ప్రాజెక్టుల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసినట్లు తెలిపారు. గతంలో రైల్వే పరిస్థితి అధ్వానంగా ఉండేదని, భవిష్యత్ తరాల వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రైల్వేను ఆధునీకరించడమే మోదీ గ్యారంటీ అని పేర్కొన్నారు. దేశం కోసమే కేంద్రం అన్ని రంగాలను అభివృద్ధి చేస్తోందని, కేవలం ఓట్ల కోసమని ప్రతిపక్షాలు అంటున్నాయని, వారివి కేవలం విమర్శలు మాత్రమేనని ప్రధాని అన్నారు.

మోదీని మూడోసారి ప్రధాని చేయండి..

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు చూసి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్రమోదీని మూడోసారి ప్రధాని చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపు నిచ్చారు. డిచ్‌పల్లి గూడ్స్ షెడ్డు, హమాలీ గది, ఇతర అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. డిచ్‌పల్లి స్టేషన్ మాస్టర్ గంగరాజు మాట్లాడుతూ.. గూడ్స్ షెడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధికిగాను రూ.1000 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. దీంతో స్టేషన్ మరింత అభివృద్ధి చెందనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న, నాయకులు వెంకటరమణ, చంద్రకాంత్, చౌకి లక్ష్మణ్, రామకృష్ణ, కిషన్‌నాయక్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సీపీని కలిసిన ఎమ్మెల్సీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనవార్ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో భేటీ అయ్యారు. రంజాన్ నెల ప్రారంభమైన నేపథ్యంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని మహేశ్ కుమార్ గౌడ్ సీపీని కోరారు. ఈ భేటీలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ ఉన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ఎక్సైజ్ సూపరింటెండెంట్

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, నగర ఎక్సైజ్ సీఐ దిలీప్ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



మహేశ్‌కుమార్ గౌడ్‌తో సీపీ కల్మేశ్వర్

క్లుప్తంగా

సీఎంకు రాఖీ కట్టిన నిజామాబాద్ మహిళ



డొంకేశ్వర్(ఆర్మూర్): సికింద్రాబాద్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన స్వశక్తి మహిళా సదస్సులో జిల్లాకు చెందిన ఎస్‌హెచ్‌జీ మహిళా సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టారు. సదస్సులో అన్ని జిల్లాల నుంచి స్టాళ్లను ఏర్పాటు చేయగా, నిజామాబాద్ ఐకేపీ అధికారులు కూడా బంజారా క్రాఫ్ట్స్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. బోధన్ మండలం ఎరాజ్‌పల్లికి చెందిన భవాని మహిళాసంఘం సభ్యురాలు జ్యోతి తాను స్వయంగా తయారు చేసిన బంజారా హ్యాండ్లూమ్స్‌ను ప్రదర్శనలో ఉంచారు. స్టాల్‌ను సందర్శించిన సీఎం రేవంత్‌కు ఆమె తాను తయారు చేసిన రాఖీని కట్టారు.

వ్యభిచార గృహంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని వందఫీట్ల రోడ్డు (వినాయక్‌నగర్)లో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు నాలుగో టౌన్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. నలుగురు యువతులతోపాటు నలుగురు విటులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అలాగే నిర్వాహకురాలిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

PUBLIC NOTICE

General Public/Banks/Financial Institutions, are hereby informed that **Smt. Gindam Priyanka W/o Gindam Navaneeth,** applicant herein, have approached My client i.e State Bank of India, RASMEC-CC, Nizamabad for Sanction of Housing Loan, offering below mentioned schedule of property as collateral security.

Further represented by My client that one of the previous vendor Shaik Rajiya Begum D/o Jamal, W/o S.K. Ahemed Ali, has lost link original **Regd. Sale Deed No. 8575/1998,** while travelling on bike from Jagiryal village to Bheemgal, on that lodged police complaint at P.S, Bheemgal, Nizamabad Dist, on 12.07.2019, accordingly issued certificate on 17.07.2019, stating that the original link document stated above is not traced out, while obtaining the loan intend to offer the certified copy of the same in the place of original as stated above along with other documents to the State Bank of India, RASMECCC, Nizamabad.

Therefore, call upon general public/financial institutions in particulars are hereby having any objections or having any charge or claim over the said property, they may be approach with relevant evidence/documents to the undersigned within 7 days of this publication, if any objections raised thereafter will not entertained and My client will proceed with proposed housing loan by creating charge over the below mentioned property.

SCHEDULE OF PROPERTY:

All that the Open Plot No.524, Ext.200.00 Sq.yds, lies in Sy.No.424/AA, vide L.P No.8/97, situated at Ward No.1, Block No.1, MARUTHIRAM REAL ESTATE, Vinayak Nagar, Nizamabad, within the Municipal limits of Nizamabad. As Bounded by:

North : Plot.No.525, South : Plot No.523, East : 33'.0" Wide Road, & West: Plot.No.509.

Sd/- **E.JAYASIMHA** Advocate, Nizamabad Cell No.9490242033.

'కార్పొరేట్ల' కోసమే నూతన విద్యా విధానం

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి

తెయూ(డిచ్‌పల్లి): కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయాలని ప్రయత్నిస్తోందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ సెమినార్ హాల్‌లో మంగళవారం విద్యార్థుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏ పున్నయ్య అధ్యక్షతన 'నూతన విద్యా విధానం- ప్రైవేటీకరణ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యవక్తలుగా పాల్గొన్న ఆకునూరి మురళి, జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రయోజనాలకి విరుద్ధంగా విదేశీ, కార్పొరేట్ ప్రయోజనాల కోసమే నూతన విద్యా విధానం తీసుకొచ్చారని ఆరోపించారు. ఈ విధానంతో దేశంలో విదేశీ యూనివర్సిటీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ యూనివర్సిటీలను దివాళా తీసే చర్యలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కొఠారి కమిషన్ ప్రతిపాదించిన విధంగా కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 10 శాతం, జీడీపీలో 6శాతం నిధులు కేటాయించకుండా ఎన్ని సంస్కరణలు, విధానాలు తీసుకొచ్చినా ప్రయోజనం ఉండదన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్యా రంగంలో తీసుకొస్తున్న మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలని కోరారు. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయకరెడ్డి, హైదరాబాద్ కేంద్రీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కే లక్ష్మీనారాయణ, తెయూ అధ్యాపకులు నాగరాజు, యూనివర్సిటీల జాతీయ కన్వీనర్ ఎస్ నాగేశ్వర్‌రావు, విద్యార్థి సంఘాల నాయకులు పి మహేశ్, రామకృష్ణ, రెహమాన్, రాచకొండ విఘ్నేష్, ఆర్ గౌతమ్ కుమార్, కర్క గణేశ్, ఎం నరేందర్, జన్నారపు రాజేశ్వర్, అంజలి, రఘురాం, లావిశెట్టి ప్రసాద్, విఠల్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ఖలీల్‌వాడి: ప్రతి మహిళ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కోర్టు మొదటి అదనపు మేజిస్ట్రేట్ కుష్బూ ఉపాధ్యాయ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళాపోలీసు సిబ్బందితో రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. మహిళలకు న్యాయమూర్తి బహుమతులు ప్రదానం చేశారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని న్యాయమూర్తి అన్నారు. అనంతరం సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. మహిళలు స్వేచ్ఛగా జీవితంలో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ప్రొబెషనరీ ఐపీఎస్ బి చైతన్య రెడ్డి, ట్రెయినీ ఐఏఎస్ డాక్టర్ కిరణ్మయి, తేజిత, సీఐ శ్రీలత, ఎస్సైలు అంజమ్మ, పద్మ, ప్రవళిక, ఆర్ఎస్సై స్రవంతి, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, పోలీస్ కార్యాలయ సిబ్బంది, హోంగార్డులు, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జడ్జి కుష్బూ ఉపాధ్యాయ

ప్రజలు మోదీ సర్కార్‌ను కోరుకుంటున్నారు

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



హైదరాబాద్‌కు వెళ్తున్న ఎమ్మెల్యే, బీజేపీ శ్రేణులు

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు సాధించడం ఖాయమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ధీమా వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప ఆత్మీయ సమ్మేళనానికి నిజామాబాద్ నుంచి ఎమ్మెల్యేతోపాటు బీజేపీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. దేశ ప్రజలు 'ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్'ను కోరుకుంటున్నారన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనతో పోలిస్తే నరేంద్రమోదీ పదేళ్ల పాలన ఎంతో అద్భుతంగా ఉందన్నారు. రామ మందిర నిర్మాణ, ఆర్టికల్ 370 రద్దు, మహిళా రిజర్వేషన్ బిల్లు, సీఏఏ వంటి అనేక విజయాలు బీజేపీతోనే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు, నాయకులు మమత ప్రభాకర్, బంటు వైష్ణవి రాము, మెట్టు విజయ్, పుట్ట వీరేందర్, పోలింగ్ బూత్ అధ్యక్షులు, నాయకులు భాస్కర్, హరీశ్‌రెడ్డి, చింతకాయల రాజేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంభునిగుడి హుండీ లెక్కింపు



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని ప్రముఖ శివాలయం శంభునిగుడి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్ సుప్రియ, ఈవో శ్రీరాంరవీందర్ సమక్షంలో హుండీని లెక్కించారు. రూ.1,97,545 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గాండ్ల లింగం, ధర్మకర్తలు ఎస్ భాస్కర్, కే రాఘవేందర్, టీ స్వరూప, ఆలయ అర్చకుడు రాజ్ కిరణ్, జూనియర్ అసిస్టెంట్ టి కిశోర్, భక్తులు పాల్గొన్నారు.

'హెచ్చరిక' ఫ్లెక్సీల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

బాల్కొండ: గోదావరిలో పుణ్యస్నానాలకు వచ్చి ఎస్సారెస్పీ పుష్కరఘాట్లలో నీట మునిగి భక్తులు మృతి చెందుతుండడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడంపై 'భద్రత.. ఎవరి బాధ్యత?' శీర్షికన 'సాక్షి'లో ఈనెల 10వ తేదీన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ప్రాజెక్టు అధికారులు.. ఆనకట్టపై ప్రాజెక్టుకు వచ్చే సందర్శకులు, పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు అవగాహన కలిగేలా 'హెచ్చరిక' ఫ్లెక్సీలను మంగళవారం ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు ఆనకట్ట కుడి, ఎడమలు 14కిలో మీటర్ల మేర ఉండగా, అధికారులు మాత్రం మూడు చోట్ల మాత్రమే హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటకులు ప్రాజెక్టులోపలికి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

త్వరలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు



వెంకటేశ్వర్లు

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి జిల్లాలో 4జీ సేవలు విస్తరించనున్నట్లు బీఎస్ఎన్ఎల్(భారత్ సంచార్ నిగమ్ సంస్థ) జనరల్ మేనేజర్ వీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. జీఎంగా ఉమ్మడి జిల్లాకు నూతనంగా వచ్చిన ఆయన మంగళవారం 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పుల కారణంగా రానున్న రోజుల్లో సంస్థ ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందబోతున్నట్లు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో 164, కామారెడ్డి జిల్లాలో 102 టవర్లు ఏర్పాటు చేయనున్నట్లు జీఎం వెల్లడించారు. ప్రస్తుతం బాన్సువాడ పట్టణం మూడు 4జీ టవర్లు పరీక్షల నిమిత్తం ఉన్నాయని, వీటిద్వారా అక్కడి వినియోగదారులకు 4జీ సేవలు సంపూర్ణంగా అందుతున్నట్లు వెల్లడించారు.

ఫైబర్ పనులు పూర్తి

ఉమ్మడి జిల్లాలో బ్రాడ్‌బ్యాండ్ హైస్పీడ్ సేవలకు కాపర్ టు ఫైబర్ నెట్‌వర్క్ పనులు దాదాపు పూర్తయినట్లు జీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి, ఆర్మూర్, బోధన్ పట్టణ ప్రాంతాల్లో కాపర్ టు ఫైబర్ కనెక్షన్ల ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందుతాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 12వేల బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు. కనెక్షన్ల సంఖ్యను పెంచేందుకు ఉమ్మడి జిల్లాలో టెలికాం ఇన్‌ఫ్రా ప్రొవైడర్స్ దాదాపు 100 మంది ఉన్నారని, త్వరలో మరో 50 మందిని నియమిస్తామని వెల్లడించారు.

'ఆ విద్యా సంస్థలకు అనుమతులు లేవు'

నిజామాబాద్‌అర్బన్: నగరంలో నిశిత ఇంటర్నేషనల్ స్కూల్, మాక్లూర్‌లో కొనసాగుతున్న ఆల్ఫోర్స్ కోచింగ్ సెంటర్‌కు ఎలాంటి అనుమతులు లేవని జిల్లా విద్యాశాఖాధికారికి దుర్గాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా విద్యా సంస్థలను నడిపితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్పొరేట్, ఇంటర్నేషనల్ పేరిట స్కూళ్లను నిర్వహించొద్దని స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు అన్ని అనుమతులు ఉన్న విద్యా సంస్థల్లోనే తమ పిల్లలకు అడ్మిషన్లు తీసుకోవాలని సూచించారు.

చక్కని వేదిక 'ప్రేరణ'

తెయూ(డిచ్‌పల్లి): కామర్స్ విద్యార్థుల్లోని ప్రతిభ వెలికితీసేందుకు ప్రేరణ (రాష్ట్రస్థాయి ఇంటర్ కాలేజ్ కామర్స్ ఫెస్ట్) కార్యక్రమాన్ని ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలంగాణ యూనివర్సిటీ ఆర్గనైజింగ్ డైరెక్టర్, రిజిస్ట్రార్ ఎం యాదగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి రాంబాబు తెలిపారు. యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల స్థాయిలో వ్యాసరచన, కామర్స్ క్విజ్, క్వెస్ట్, వ్యక్తిత్వం, జస్ - ఏ - మినిట్, పేపర్ ప్రజెంటేషన్ విత్ పీపీటీ, ఫేస్ పెయింటింగ్, రంగోళి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. మంగళవారం సాయంత్రం తన చాంబర్‌లో 'ప్రేరణ' బ్రోచర్లను రిజిస్ట్రార్ ఆవిష్కరించారు. కళాశాల స్థాయిలో విజేతలకు 20వ తేదీన యూనివర్సిటీ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. యూనివర్సిటీ స్థాయి విజేతలకు 23వ తేదీన సికింద్రాబాద్‌లోని పీజీ కళాశాలలో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని, కామర్స్ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు 'ప్రేరణ' చక్కని వేదిక అని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. వర్సిటీ ఆర్గనైజింగ్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాస్, సభ్యులు శ్వేత, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో అత్త ఆత్మహత్య

- తనను ప్రశ్నిస్తారనే భయంతో కోడలి ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రికి తరలింపు
- రెంజల్ మండల కేంద్రంలో కలకలం

రెంజల్(బోధన్): కుటుంబ ఆర్థిక పరిస్థితిపై అత్తాకోడళ్ల మధ్య మాటమాట పెరగడంతో అత్త ఆత్మహత్య చేసుకోగా, కోడలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రెంజల్ మండల కేంద్రంలో కలకలం సృష్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పెరిక లక్ష్మి(53), ఆమె కోడలు సోమవారం రాత్రి కుటుంబ ఆర్థికపరిస్థితిపై చర్చించుకుంటుండగా మాటమాట పెరిగి వాగ్వాదం జరిగింది. మనస్తాపానికి గురైన లక్ష్మి మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారితోపాటు కుటుంబ సభ్యులు లక్ష్మి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా, రాత్రి జరిగిన గొడవ విషయంలో తనను ప్రశ్నిస్తారనే ఆందోళనతో కోడలు ఇంట్లోని మరో గదిలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, గమనించిన బంధువులు వెంటనే 108లో నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. రూ.10లక్షల అప్పు ఉండడంతో తన భార్య ఆత్మహత్య చేసుకుందని మృతురాలు లక్ష్మి భర్త భూమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించారు.


హొన్నాజీపేట్‌లో..

ధర్పల్లి: ఆర్థిక ఇబ్బందుల కారణంగా మండలంలోని హొన్నాజీపేట్‌కు చెందిన మెండె నరేశ్(30) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నరేశ్ సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి ఆరా తీసినప్పటికీ ఆచూకీ లభించలేదు. మంగళవారం సాయంత్రం గ్రామశివారులోని చెట్టుకు నరేశ్ మృతదేహం వేలాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

వేల్పూర్/ఇబ్రహీంపట్నం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామం వద్ద మంగళవారం రాత్రి బైకు అదుపుతప్పి వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన రాజారపు నరేశ్(35) మృతి చెందాడు. వేములకుర్తికి చెందిన స్నేహితుని ఇంట్లో జరిగిన శుభకార్యంలో పాల్గొన్న నరేశ్ ఇంటికి తిరిగి వస్తుండగా, బైక్ అదుపుతప్పి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి..



లింగంపేట: మండలంలోని సురాయిపల్లి స్కూల్ తండాకు చెందిన రమావత్ రవీందర్(28) మంగళవారం చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. వివరాలు.. తండాకు చెందిన నలుగురు చేపల వేటకు వెళ్లారు. గ్రామ శివారులోని ఒంటరికుంటలో వల వేశారు. తిరిగి వలను తీసే క్రమంలో రవీందర్ కాళ్లకు వల తట్టుకొవడంతో కేకలు వేస్తూ నీట మునిగిపోయాడు. మిగతా వారు కాపాడే ప్రయత్నం చేశారు. బయటకు తీసి లింగంపేట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య సరిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండల కేంద్రంలోని బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. అలాగే స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేశామని, సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లులేని ఏడు ద్విచక్రవాహనాలతోపాటు ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. ధ్రువపత్రాలు సమర్పిస్తేనే వాహనాలను రిలీజ్ చేస్తామని ఎస్సై స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పోలీసులమని బంగారం అపహరణ

- వృద్ధుడిని దోచుకున్న దుండగులు
- నవీపేట మండల కేంద్రంలో ఘటన

నవీపేట: 'మేము పోలీసులం.. మా సార్ ముందు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. బంగారు గొలుసు, ఉంగరాలు కనిపించకుండా దాచుకో..' అని భయపెట్టిస్తూనే ఓ వృద్ధుడిని నకిలీ పోలీసులు దోచుకున్నారు. ఈ ఘటన నవీపేట మండల కేంద్రం పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..

నవీపేట శివారులోని లింగమయ్యగుట్ట కాలనీకి చెందిన రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి నరసింహాచారి మంగళవారం ఉదయం మండల కేంద్రంలోని మార్కెట్‌కు వచ్చాడు. పని ముగించుకుని స్కూటీపై ఇంటికి తిరిగి వెళ్తుండగా, బాసర రోడ్డుపై ఎదురుగా బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. నరసింహాచారిని ఆపిన ఆ వ్యక్తులు.. తాము పోలీసులమని, మా పెద్దసార్ ముందు వాహనాలను తనిఖీ చేస్తున్నాడని నమ్మించారు. మెడలోని బంగారు గొలుసు, చేతివేళ్లకు ఉన్న రెండు ఉంగరాలను స్కూటీ డిక్కీలో దాచుకోవాలని సూచించారు. వారి మాటలను నమ్మిన నరసింహాచారి బంగారు గొలుసు, ఉంగరాలను పేపర్‌లో చుట్టి స్కూటీ డిక్కీలో పెట్టే ప్రయత్నం చేస్తుండగా, దండుగులు అతడిని ఏమార్చి మరో పేపర్ పొట్లంను డిక్కీలో పెట్టారు. నరసింహాచారి కొంతదూరం వెళ్లిన తరువాత అనుమానంతో పేపర్‌పొట్లాన్ని విప్పి చూడగా అందులో ఐదు రోల్డ్‌గోల్డ్ ఉంగరాలు ఉన్నాయి. తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఎస్సై యాదగిరిగౌడ్ సంఘటనాస్థలానికి చేరుకొని దగ్గరలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు.



నరసింహాచారి



నకిలీ పోలీసులు పేపర్‌లో చుట్టిన రోల్డ్ గోల్డ్ ఉంగరాలు

ఇస్తాంబుల్‌లో తప్పిపోయిన జాన్కంపేట్ వాసి


- మతిస్థిమితం కోల్పోయి ఇంటికి వస్తూ..
- జాడ తెలియక కుటుంబీకుల ఆందోళన



భానుచందర్ (ఫైల్)

వేల్పూర్: నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన అగ్గు భానుచందర్ టర్కీ దేశంలో మతిస్థిమితం కోల్పోయి ఇంటికి తిరిగివస్తూ ఇస్తాంబుల్ ఎయిర్‌పోర్టులో తప్పిపోయాడు. ఈ విషయం కుటుంబీకులకు తెలియడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భానుచందర్, జాన్కంపేట్‌కు చెందిన మరో వ్యక్తి గంగారెడ్డితో కలిసి 15 రోజుల క్రితం ఉపాధికోసం టర్కీ దేశానికి వెళ్లాడు. వారం రోజులు బాగానే ఉన్నా తర్వాత మతిస్థిమితం కోల్పోయి పనిచేయలేని స్థితికి చేరుకున్నాడు. దాంతో అతనికి పని కల్పించిన కంపెనీవారు ఈనెల 6న ఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో జతచేసి ఇంటికి పంపించారు. టర్కీలోని ఇస్తాంబుల్ చేరుకొని ఇండిగో విమానంలో ముంబాయికి వారు చేరుకోవాలి. ఇస్తాంబుల్‌లో బోర్డింగ్ పూర్తయిన భానుచందర్ అక్కడే తప్పిపోయి ఇండిగో విమానం ఎక్కలేదు. ఎంత వెతికినా దొరకకపోయేసరికి పిప్రికి చెందిన వ్యక్తి ముంబాయికి చేరుకున్నాడు. భానుచందర్ మానసిక పరిస్థితి బాగా లేనందున ముంబాయి ఎయిర్‌పోర్టులో రిసీవ్ చేసుకోవాలని కుటుంబీకులకు ముందే సమాచారం అందడంతో వారు ముంబాయి ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే భానుచందర్ రాలేదు. కుటుంబీకులు ఎయిర్‌పోర్టు అధికారులను సంప్రదించగా భానుచందర్ లగేజి వచ్చి, తిరిగి వాపసు వెళ్లిందని సమాచారం ఇచ్చారన్నారు. తమ వ్యక్తి ఆచూకీ తెలపాలని ముంబాయి పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అనంతరం మంగళవారం హైదరాబాద్‌లోని టర్కీ రాయబార కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. భానుచందర్ విదేశాలకు వెళ్లడం ఇదే మొదటిసారి కావడం, మతిస్థిమితం కోల్పోవడంతో తల్లిదండ్రులు, భార్య సోని తీవ్ర భయాందోళన చెందుతున్నారు. భానుచందర్ ఆచూకీ కనుగొని ఇంటికి పంపాలని వారు కోరుతున్నారు.

ఇసుక క్వారీల తనిఖీ



బాన్సువాడ : బీర్కూర్ ప్రాంతంలోని మంజీరలో ఇసుక క్వారీలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ ఆదేశాల మేరకు రామచంద్రాపురం ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో క్వారీలను తనిఖీ చేశారు. ఇసుక స్టాక్ యార్డ్‌ను పరిశీంచారు. ఇసుక క్వారీల్లో గతంలో చేపట్టిన తవ్వకాలు, ప్రభుత్వ పనుల కోసం ఏ మేరకు ఇసుక తరలించారనే నివేదికలను తయారు చేసి డీజీకి అందజేస్తామని ఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. ఆయన వెంట విజిలెన్స్ ఏజీ హరికృష్ణ, ఇన్‌స్పెక్టర్ మహేశ్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, మైనింగ్ టీఎస్ఎండీసీ అధికారులున్నారు.

భార్యను వేధించిన భర్తపై కేసు

ఎల్లారెడ్డి: భార్యను వేధించిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రొడ్డ రేణుకను ఆమె భర్త కిషన్ వివాహేతర సంబంధం ఉందంటూ తరుచూ కొడుతుండడంతో ఆమె ఫిర్యాదు చేసిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


చెత్తకుప్పలకు మంటలు

కామారెడ్డి టౌన్/కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో దుకాణాల వెనకాల ఉన్న చెత్త కుప్పలకు మంగళవారం మంటలు అంటుకున్నాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

రోడ్డు ప్రమాదంలో 25 గొర్రెలు మృతి

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంఠేశ్వర్ బైపాస్ సిగ్నల్ వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 25 గొర్రెలు మృతి చెందాయి. ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని జాల్నా జిల్లా నుంచి 150 గొర్రెలను డీసీఎం వాహనంలో తరలిస్తున్నారు. నిజామాబాద్ కంఠేశ్వర్ బైపాస్ వద్దకు రాగానే ఆర్మూర్ నుంచి అతి వేగంగా వస్తున్న కారు డీసీఎం వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో డీసీఎంలో ఉన్న 25 గొర్రెలు మృతిచెందగా మిగిలిన వాటికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం తీవ్రంగా దెబ్బతిన్నది. కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలవడంతో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డీసీఎం డైవర్ వాగ్మారే ప్రకాష్ ఫిర్యాదు మేరకు కారు డైవర్ అరేపల్లి అవినాష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మున్సిపల్ వాహనం సీజ్



ఆర్మూర్‌టౌన్: ధ్రువీకరణ పత్రాలు లేకుండా నడుపుతున్న మున్సిపల్ వాహనాన్ని రోడ్డు రవాణా సంస్థ అధికారులు సీజ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌లో చెత్త సేకరిస్తున్న వాహనానికి రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ లేకపోవడంతో ఎంవీఐ వివేకానంద రెడ్డి 15రోజుల క్రితం సీజ్ చేశారు. ధ్రువీకరణ పత్రాలు సమర్పించి వాహనాన్ని విడిపించుకోవాల్సిన సంబంధిత అధికారులు వాహనాన్ని అలాగే వదిలేశారు. ప్రత్యామ్నాయంగా ట్రాక్టర్‌తో చెత్తను సేకరిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

బహిరంగ వేలము ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లి. నిజామాబాద్ మరియు బోధన్ ఆర్మూర్, బాన్సువాడ శాఖల వారి ఈ క్రింద తెలుపబడిన వాహనములు బహిరంగ వేలము నిర్వహించబడును.

VEHICLE NO	MODEL	MFG YEAR
TS16EQ 7516	TATA ZEST 1.3L XE QUADRAJET 75PS DIESEL 5 SEATER	2018
TS10UB 5397	HYUNDAI XCENT-P	2018
AP01R 8634	CHEVROLET TAVERA NEO-P	2010
TS12UB 3965	ASHOK LEY LAND 2516 TIPPER	2009
TS10UA 9013	TATA ACE MEGA	2016
AP25Y 0155	AL COMET CT 1613 H FBT	2008
TS16FK 6400	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2014

SHRIRAM Finance

AUCTION DATES: 13.03.2024

SHRIRAM AUTMALL INDIA LIMITED NIZAMABAD

H.No. 5-1, Aurgul Village, Jakranpally Mandal, Nizamabad Dist. Telangana - 503224, Cell: 7793999220, 9701878143

EDUCATION

Single Sitting : 10th, Inter, BA, B.Com, B.Sc, BED, BPED, UGDPED, BBA, MBA, DMLT, BMLT, BNYS, BAMS, BHMS, B.Tech, NURSING ITI, Pharmacy,LLB,Phd:8143583986 [L-806434]

SERVICES

CHANGE OF NAME

I, MEESAM NAMRATHA (Old Name) Changed my Name as CHEETI NAMRATHA (New name) W/o. SATHISH R/o.H.No:2-106 Guduru Pothangal, Karimnagar TS [Z-1080574]

I, METTU SAYABU (Old Name) Changed my Name as METTU SAILU (New name) S/o. METTU PEDDA RAJANNA R/o.H.No:1-89, Inayat Nagar, Kammarpally, NZB. [Z-1080713]

I, NOOR BANU (Old Name) NZB. Hence Changed my Name as NOOR BEGUM W/o. MOHAMMED BOGDAD ALI (New name). [Z-1080714]

WANTED

NZB లో ఐశ్వర్య బోటిక్‌లో పని చేయుటకు ప్రావీణ్యం కల్గిన టేలరింగ్ చేసే మహిళ కావలెను. టేలరింగ్ నేర్పుటకు (MALE) మాస్టర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. ఫోన్: 77025 57561 [Z-1080711]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233884]

లక్ష్మి ట్రావెల్స్‌లో పని చేయడానికి సిస్టమ్ ఆపరేటర్ కావలెను. ఆకర్షణీయమైన వేతనం కలదు.మల్టీ ఫ్లెక్స్ బ్యాక్ సైడ్ NZB సెల్: 9701007073, 9908194939. [Z-1080715]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.